క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీరాములు

ఏలూరు (టూటౌన్): కాపు సంక్షేమ సేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా, నగర కమిటీల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా 100 మంది పేదలకు చికెన్ బిర్యానీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల సహకారంతో రాజ్యాధికారం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన నాయకులు వాసా రాజు, కూనిశెట్టి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి పునరంకితం కావాలి



మొండికోడులో నా భూమి, నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏలూరు రూరల్: దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఏలూరు మండలం మొండికోడు, కొక్కిరాయిలంక గ్రామాల్లో ప్రారంభించిన నా భూమి, నా దేశం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎందరో ప్రాణ త్యాగం చేసి దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వై సుజాత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఒక స్తూపం నిర్మించి, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరజీవులను స్మరించుకుంటూ, ప్రజల్లో దేశభక్తి పెంపొందించేలా ప్రతిజ్ఞ చేయిస్తామని, నాలుగు మొక్కలు నాటుతామని, కలశాలతో మట్టి సేకరించి మండల కేంద్రానికి తరలిస్తామని చెప్పారు. ఆగస్టు 15న జెండా పండుగ అనంతరం సేకరించిన మట్టి ఒక యువ కార్యకర్త ద్వారా ఢిల్లీకి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వేజేళ్ల గోపాలకృష్ణంరాజు, తోకల అమల, ఉపసర్పంచ్‌లు ఊటుకూరి ఏసు, ఇంటి భూషణరాజు, ఉపాధి హామీ ఏపీఓ కిషోర్, కార్యదర్శులు ప్రసాద్‌బాబు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పాఠశాలల్లో అభివృద్ధి పనులు

- కొల్లేరులో లంక గ్రామాల ప్రజల హర్షం
- నాడు, నేడు రెండో విడత రూ.1.95 కోట్లు మంజూరు

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గం ఏలూరు మండల గ్రామాల్లో నాడు నేడు పథకం రెండో విడత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వం మొదట విడతలో రూ.2.6 కోట్లు, రెండో విడతలో రూ.1.95 కోట్లు మంజూరు చేసింది. రెండో విడత నిధులు రూ.1.95 కోట్లతో చేపట్టిన గుడివాకలంక జెడ్పీ పాఠశాల తరగతి గదుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొదట విడత నిధులతో గుడివాకలంక గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ప్రత్తికోళ్లలంక జెడ్పీ పాఠశాలలో మరుగుదొడ్లు, నీటి సరఫరాకు పైప్‌లైన్, ప్రహరీ, సురక్షిత తాగునీటి కోసం ప్రత్యేక షెడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చాయి. కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు పాఠశాలల్లో సురక్షిత తాగునీరు ప్లాంట్, విద్యుత్, ఫ్లోరింగ్, తరగతి గదుల సుందరీకరణ, పిల్లలు కూర్చొనేందుకు బల్లలు తదితర మౌలిక వసతులు కల్పించారు. చాటపర్రు జెడ్పీ పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాఠశాల అభివృద్ధి కొల్లేరు ప్రజల ఆలోచన మార్చింది. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం బాలబాలికలకు అందిస్తోన్న పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకంతోపాటు వివిధ పరీక్షల్లో విద్యార్థులు సాధిస్తోన్న మార్కులపై కొల్లేరు ప్రజలు చర్చిస్తున్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీలో సభ్యులుగా ఉండేందుకు వారు పోటీపడుతున్నారు.



రెండో విడత గుడివాకలంక జెడ్పీ పాఠశాలలో నిర్మిస్తోన్న అదనపు గదులు



మొదట విడతలో అభివృద్ధి చేసిన గుడివాకలంక ప్రాథమిక పాఠశాల

కళాశాల మంజూరు చేయాలి



మా గ్రామంలో జెడ్పీ పాఠశాలకు నిధులు మంజూరు చేయడం సంతోషాన్నిస్తోంది. మాకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి. దీంతో కొల్లేరు గ్రామాల పిల్లలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికే పిల్లలకు యూనీఫాం, షూ, టై, బూట్లు ప్రభుత్వం అందించింది. పిల్లలతో పాటు తల్లిదండ్రులు సైతం కాన్వెంట్‌లో చదివిస్తున్నామని బావిస్తున్నారు.

– జయమంగళ ప్రభావతి, గుడివాకలంక, సర్పంచ్

అభివృద్ధి జరిగింది



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు కృషితో మా గ్రామంలో మండల పరిషత్ పాఠశాల అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. గతంలో ఎన్నడూ పాఠశాలల అభివృద్ధికి ఇంత పెద్దమొత్తం నిధులు విడుదల కాలేదు. పాఠశాల ప్రహరీ, సీసీరోడ్డు నిర్మించారు. గ్రామంలో పిల్లలు అందరూ ఇప్పుడు బడికి వెళ్లి చదువుకుంటున్నారు.

– వి.గోపాలకృష్ణంరాజు, సర్పంచ్, మొండికోడు



కొల్లేరు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించిన టేబుల్స్, బెంచీలు

12న శ్రామిక మహిళా సదస్సు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో వివిధ రంగాల్లో పని చేసే శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 12న ఏలూరులో శ్రామిక మహిళా జిల్లా సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించే సదస్సుకు శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. శ్రామిక మహిళలంతా పాల్గొనాలని కోరారు.

నేడు క్రైస్తవుల ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం ఏలూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు ఏలూరు నగర ఐక్య క్రైస్తవుల అభ్యుదయవాదుల కార్యాచరణ బృందం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అమలోద్భవి కథీడ్రల్ వద్ద నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, నగరంలోని పీఠాధిపతులు, గురువులు, పాస్టర్లు, మతకన్యలు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

ఏలూరు టౌన్: స్థానిక ఫిల్‌హౌస్‌పేట ప్రాంతంలోని ఒక ఇంట్లో రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి 10 కాసులకుపైగా బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏలూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. అభివృద్ధి పనుల ప్రగతిపై ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షించారు. నగరంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళుతున్నట్టు చెప్పారు. మార్కెట్‌యార్డ్ సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.45 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారపుపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద తమ్మిలేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అప్రోచ్ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. నగరంలో విలీనమైన 7 గ్రామాల్లోనూ ప్రజలకు తాగునీటి సరఫరాకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందన్నారు. అమృత్ పథకం 2.0లో సుమారు రూ.112 కోట్లు నిధులతో పైప్‌లైన్, వాటర్ ట్యాంకులు, కుళాయిలు, స్టోరేజ్ ట్యాంకులు నిర్మాణం చేపడతామని చెప్పారు. నగరంలోని ప్రతి కుటుంబానికీ రక్షిత తాగునీరు సరఫరా చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నియోజకవర్గంలో నాడు – నేడు స్కూల్స్ అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సమీక్షలో నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్‌సుందర్, ఆర్అండ్‌బీ ఎస్‌ఈ జాన్ మోషే, ఇడా వైస్ చైర్మన్ చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ ఎన్.సుధీర్‌బాబు, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, సమీక్షకు హాజరైన అధికారులు

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం

ఏలూరు టౌన్ : పేదల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని కోరారు. బుధవారం 106వ రోజు ఏలూరు వన్‌టౌన్‌లోని 4వ డివిజన్‌లోని లంబాడీపేట సచివాలయం-59 పరిధిలో వెన్నవల్లివారిపేట అంబేడ్కర్ పార్క్ నుంచి ఆయన పాదయాత్ర నిర్వహించారు. సీఎం జగన్ పేదల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని, గొప్పగా సంక్షేమ పాలన అందిస్తూ పేదలను అదుకుంటున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవని, ప్రతిపక్షాలకు ప్రజల బాగోగుల కంటే అధికారమే ముఖ్యమని ఆరోపించారు. నేడు ప్రతి ఇంటిలోనూ నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ అమలు చేసే సత్తా ప్రతిపక్షాలకు ఉందా అని ప్రశ్నించారు. తొలుత నానికి కార్పొరేటర్ చిలకపాటి డింపుల్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలకపాటి రుషి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, డైరెక్టర్లు కోరాడ బాబు, యుగంధర ప్రసాద్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, పిల్లంగోళ్ళ శ్రీదేవి, తుమరాడ స్రవంతి, పొలిమేర దాసు, కలవకొల్లు సాంబ, సుంకర చంద్రశేఖర్, గరికిముక్కు జయకర్, దేవరకొండ శ్రీనివాస్, నాయకులు మోటమర్రి సదానందం, ఆచంట వెంకటేశ్వరరావు, దొంగ రామాంజనేయులు, ప్రత్తిపాటి తంబి, అమీనా అన్సారీ, మున్నీ, బోడ కిరణ్, యల్లాపు మోజెస్, వైఎస్‌వీ శివరావు, పిట్టా ధనుంజయ్, పొలిమేర హరికృష్ణ, తొటకూర కిషోర్, లూటుకుర్తి శుభాష్, లక్కోజు గోపి, అబ్బూరి అనిల్ తదితరులు ఉన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి



నిర్వహకురాలిని అరెస్టు చేసిన సీఐ చంద్రశేఖర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వ్యభిచార గృహంపై టూటౌన్ పోలీసులు దాడి చేసి నిర్వహకురాలిని అరెస్టు చేశారు. ఆర్ఆర్‌పేట వెంకట్రామా స్కూల్ సమీపంలోని ఒక ఇంటిని ఏలూరు రూరల్ మండలం కొమడవోలుకు చెందిన ఒక మహిళ కొంతకాలంగా అద్దెకు తీసుకుంది. ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి వారితో వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తోంది. విటులకు అందమైన యువతుల ఫొటోలను వాట్సాప్‌లో పంపుతూ వ్యభిచార కేంద్రాన్ని కొనసాగిస్తోంది. ఈ సమాచారంతో సీఐ చంద్రశేఖర్, ఎస్సై నాగబాబు తమ సిబ్బందితో ఆ గృహంపై దాడి చేశారు. విటుడు పెదవేగి మండలం సూర్యచంద్రరావుపేటకు చెందిన గోళ్ల రమేష్, వ్యభిచార గృహ నిర్వహకురాలని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు యువతులను సంరక్షణా కేంద్రానికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. వ్యభిచార కేంద్రాలు నిర్వహించే సహించేది లేదని సీఐ హెచ్చరించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఏలూరు టౌన్ : ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించాలని త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ సూచించారు. బుధవారం స్థానిక ఎన్ఆర్‌పేట ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారంతా విధిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు పోగొట్టుకోవద్దని సీఐ హితవుపలికారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమం

ఏలూరు (టూటౌన్): దేశాన్ని లూటీ చేస్తోన్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్ నినాదంతో క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమించాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ కార్పొరేట్.. సేవ్ ఇండియా.. సేవ్ అగ్రికల్చర్ అంటూ క్విట్ ఇండియా డే సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ దేశవ్యాపిత పిలుపు మేరకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఏలూరు జూట్ మిల్లు సెంటర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను కారుచౌకగా కట్టబెడుతూ ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. గడిచిన తొమ్మిదేళ్లలో కార్పొరేట్ కంపెనీలకు రైటాఫ్ పేరుతో రూ.12 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్, బొగ్గు గనులు, రైల్వేలు, బ్యాంకులు, ఓడరేవులు, జాతీయ రహదారులతో పాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు దారాదత్తం చేస్తోందని వాపోయారు. కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. రైతులు పండించే పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, రైతుల రుణాలు ఒకదఫా మాఫీ చేయాలని కోరారు. సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేసి వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపును నిలుపదల చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, ఏపీ రైతు సంఘం, బీకేఎంయూ, కాంగ్రెస్ కిసాన్ సెల్, సీఐటీయూ, ఏఐకేకేఎస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు యు.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, పి.కిషోర్, డి.రంగనాథ్, పి.రామకృష్ణ, కె.కృష్ణమాచార్యులు మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

ఆపదలో ఉన్న మహిళలకు రక్షణగా పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు శాంతినగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో ఆపదలో ఉన్న తల్లీ కూతుళ్లకు పోలీసులు రక్షణగా నిలిచారు. పోలీసుల కథనం ప్రకారం.. భర్త హైదరాబాద్ వెళ్లటంతో తమ ఇంట్లో భార్య (40), కుమార్తె (14) తలుపులు వేసుకుని పడుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఎవరో హాల్లో ఉండి తలుపులు కొడుతున్నట్టు శబ్దాలు రావటంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఎవరూ అని అడిగిన సమయంలో శబ్దం ఆగిపోవడంతో వారు డయల్ 100కు, ఇరుగుపొరుగు వారికీ ఫోన్ చేశారు. పోలీసులు క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని తల్లీకుమార్తెకు ధైర్యం చెప్పి, గదులన్నీ పరిశీలించి ఎవరూ లేరని నిర్ధారించారు. సామాజిక మాధ్యమాల్లో వివిధ ఘటనలను చూసి, వాటిని ఊహించుకుని భయపడి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులను స్థానికులు అభినందించారు. త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ అపార్ట్‌మెంట్ వద్ద స్థానికులతో బుధవారం సమావేశం నిర్వహించి ధైర్యం చెప్పారు. అత్యవసర సమయాల్లో దిశ ఎస్ఓఎస్, 100, 112కు సమాచారం ఇస్తే వెంటనే తామొస్తామని భరోసా కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాచ్‌మెన్ అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ శివాజీ

ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

దెందులూరు: ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం మేదినరావుపాలెంలో రైతు మేడికొండ వెంకటేశ్వరరావు పొలంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ రైతుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో దెందులూరు మండలంలో నిర్వహించిన పాదయాత్రలో తాను ఉన్నానంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సమస్యలు విని ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోపే తెలంగాణ రైతులకు, ఏపీ రైతులకు మధ్య ఉన్న ధర వ్యత్యాసాన్ని నివారించేందుకు రూ.84 కోట్లు ఏపీలో ఆయిల్‌పామ్ రైతులకు చెల్లించారని తెలిపారు. దేశం అవశరాల్లో 16 శాతం మాత్రమే ఎడిబుల్ ఆయిల్ తయారవుతోందని, మిగిలిది అంతా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. దిగుమతి సుంకం తగ్గించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేసిన కారణంగానే మన దేశంలోకి అనేక రకాల ఆయిల్స్ వస్తున్నాయన్నారు. పతంజలి వంటి వ్యాపార దిగ్గజ సంస్థలు దెందులూరు నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగుకు సహాయ సహకారాలు అందించడం ఎమ్మెల్యేగా తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పెదవేగిలో రామశింగవరంలోని ఆయిల్‌పామ్ కేంద్రం, నర్సరీ కేంద్రాలు విజయరాయి, గోపన్నపాలెంలో ఏర్పాటు ద్వారా సేవలందిస్తున్నట్టు తెలిపారు. రైతులు సచివాలయాలకు వెళ్లి నమోదు చేయించుకుని మొక్కలు తీసుకువెళ్లి సాగు చేసుకోవచ్చన్నారు. పతంజలి సంస్థ దెందులూరు మండలంలో మౌలిక వసతుల కల్పనకు పామాయిల్ సాగు, సహకారంపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచులు ఎం.దుర్గాకుమారి రాజు, పర్వతనేని శ్రావణి సుధీర్, శనివల్లి రామకృష్ణ (విష్ణు), మెండేం సంతోష్‌కుమార్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, సొసైటీ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	80	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	32	కంద	40
పచ్చిమిర్చి	60-64	బీట్‌రూట్	36
కాకర కాయలు	50	కీరా దోస	90
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	36
బీరకాయలు (పందిరి)	50	అల్లం	150-240
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	25	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	32 - 40	బఠాణి	--
అనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	88
పొట్లకాయ(1)	25 -30	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	25

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com